క్లుప్తంగా

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న డాక్టర్ నరేందర్‌రెడ్డి

హుజూరాబాద్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని గ్రంథాలయంలో నూతనంగా నిర్మించిన అదనపు గదిని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి ఇచ్చిన మాట ప్రకారం రూ.లక్ష విరాళంగా అందించానని, నిజామాబాద్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో గ్రంథాలయాల అభివృద్ధి కృషి చేస్తానన్నారు. విద్యారంగ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. పట్టభద్రుల ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, లైబ్రేరియన్ కనకలక్ష్మి, నాయకులు తిప్పారపు సంపత్, తాళ్లపల్లి రమేశ్‌గౌడ్, గవ్వ వంశీధర్‌రెడ్డి, పంజాల శ్రీనివాస్, వేల్పుల ప్రభాకర్, రత్నం పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెం అయ్యప్పస్వామి ఆలయంలో అర్చకుడు సుమన్‌శాస్త్రి ఆధ్వర్యంలో నరేందర్‌రెడ్డి పూజలు చేశారు. అయ్యప్పస్వాములతో కలిసి భిక్ష చేశారు. స్వాములు, భక్తులు సన్మానం చేశారు.

మత ప్రచారకుల అడ్డగింత

జమ్మికుంట: మండలంలోని సైదాబాద్ గ్రామంలో క్రైస్తవ మత ప్రచారాన్ని బీజేపీ నాయకులు గురువారం అడ్డుకున్నారు. మత ప్రచారం చేయొద్దని వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాలు వాదోపవాదనలు చేసుకున్న తర్వాత వెళ్లిపోయారు.

అన్నపూర్ణ సేవా సమితి వార్షికోత్సవం



వార్షికోత్సవంలోసమితి సభ్యులు, దాతలు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవిశ్వేశ్వరస్వామి దేవాలయం(బొమ్మల గుడి)లో అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిత్య అన్నదానం నిర్వహణ రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం వార్షికోత్సవం నిర్వహించారు. ఆలయ ట్రస్టు సభ్యుడు కొండూరు దుర్గాప్రసాద్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పేదలు, యాచకుల కోసం ఏర్పాటు చేసి అన్నపూర్ణ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో నిత్యాన్నదానం రూపుదిద్దుకుందన్నారు. సేవా సమితి సభ్యులు, దాతల సహకారం అందించారని, భవిష్యత్‌లో మరింత ఎక్కువ మంది దాతలు సహకరించాలని కోరారు. అనంతరం మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల



నీటిని విడుదల చేస్తున్న వీఆర్‌ఏ, తదితరులు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన సంగోజీపేట చెరువు నీటిని యాసంగి పంటలకు విడుదల చేశారు. మాజీ జెడ్పీటీసీ అందె స్వామి ఆధ్వర్యంలో రైతులు తీర్మానం చేయగా వీఆర్‌ఏ చెరువు తూం షట్టర్‌ను ఎత్తి నీటిని వదిలారు. చెరువు కింద 534 ఎకరాల ఆయకట్టు ఉండగా మూడు నెలలపాటు పంటలకు నీరు సరఫరా కానుందని అందె స్వామి తెలిపారు. వెంట ఐబీ అధికారులు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వీణవంక: మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొమిరె ధర్మయ్య అనారోగ్యంతో మృతి చెందగా మాజీ సర్పంచ్ పోతుల నర్సయ్య అంత్యక్రియల్లో పాల్గొని రూ.రెండువేలు అందించారు. వెంట మాడ రవీందర్‌రెడ్డి, రాజయ్య, గట్టు కుమారస్వామి, పైడిమల్ల శ్రీనివాస్, కొమిరె లక్ష్మణ్, బొంగోని ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

మానకొండూర్ పీహెచ్‌సీలో సాధారణ ప్రసవం

మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం సాధారణ ప్రసవం చేశామని వైద్యాధికారులు తెలిపారు. గంగిపల్లి గ్రామానికి చెందిన మహిళా మొదటి ప్రసవం కోసం పీహెచ్‌సీకి రాగా మొదటి కాన్పులో మగబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, సల్మాన్, సూపర్ వైజర్ రాజునాయక్, స్టాఫ్‌నర్సు ఖలీద్, బతుకమ్మ, ఏఎన్‌ఎం జి.యాద, జయమాలిని, ఆశా కవిత పాల్గొన్నారు.

సాగు పెరగడం లేదు

- కొన్నేళ్లుగా తగ్గుతున్న పప్పు దినుసుల సాగు
- పెరిగిన నీటి వనరులతో రైతుల అనాసక్తి
- ఆరుతడి పంటల సాగుకు వెనుకడుగు



గన్నేరువరంలో రైతులు పండించిన కందులు(ఫైల్)

గన్నేరువరం: నిత్య జీవితంలో పప్పు దినుసులకు ఎంతో ప్రాధాన్యం ఉంది. శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంలో కీలక పాత్ర వహిస్తాయి. ప్రోటీన్లు సమృద్ధిగా ఉండటంతో ఆరోగ్య పరిరక్షణలో ప్రముఖ భాగమయ్యాయి. ఏటా జనాభా పెరుగుదలకు అనుగుణంగా పప్పు దినుసుల వినియోగం పెరుగుతోంది. అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి లేకపోవడంతో ధరలు మండిపోతున్నాయి. కొరత నేపథ్యంలో వినియోగం ఎక్కువగా ఉండే కంది, మినుము, పెసర పప్పుల ధరలు ఏటా అమాంతం పెరుగుతున్నాయి. వివిధ కూరలు, అల్పాహారంలో పప్పుల వినియోగం తప్పనిసరి. కానీ ధరల పెరుగుదల కారణంగా సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. పరిస్థితి నుంచి బయట పడాలంటే పప్పు దినుసులను అధిక విస్తీర్ణంలో సాగు చేయాలి.

ఈ ఏడాది పెరిగేనా...

గన్నేరువరంలో 2019 నుంచి ఏటా వరి సాగు పెరుగుతూ వస్తోంది. నీటి వనరులు పుష్కలంగా లభిస్తుండటం, సాగు యంత్రాల వినియోగంతో శ్రమ తగ్గుతోంది. ప్రస్తుతం మందుల పిచికారీకి డ్రోన్లు వినియోగిస్తున్నాయి. వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని ప్రభుత్వం, అధికారులు సూచిస్తున్నారు. చెరువులు, కుంటల కింద మినహా మిగతా భూముల్లో వరికి బదులు ఇతర పంటలను సాగు చేసుకోవచ్చు. కానీ మొక్కజొన్నకు మార్కెట్‌లో గతంలో డిమాండ్ తగ్గి మళ్లీ పెరుగుతుండటంతో దీనివైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. గతేడాది యాసంగిలో 800 ఎకరాల వరకు మొక్కజొన్న సాగు కాగా ఈ ఏడాది 1500 ఎకరాల వరకు సాగయ్యేలా కనిపిస్తోంది. దీంతో ప్రస్తుతం నూనె పంటలు వేరుశెనగ, పొద్దుతిరుగుడు, పప్పు దినుసులు పెసర, బబ్బెర, మినుములు, శనగ సాగుకు రైతులు అనాసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. మూడేళ్లుగా మండలంలో 200 నుంచి 300 ఎకరాల్లో మాత్రమే పప్పు దినుసులు సాగు అవుతున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పంటలకు సరియైన మార్కెట్ సదుపాయం లేకపోవడంతో పాటు దిగుబడి తక్కువ, అధిక శ్రమతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అధిక దిగుబడి సాధించడానికి మేలైన వంగడాలను రైతులకు అందుబాటులోకి తీసువస్తేనే పరిస్థితిలో మార్పు వస్తోంది. యాసంగిలోనైనా వరి సాగు తగ్గించి, పప్పు దినుసులు సాగు పెంచేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రధాన పంటల సాగు

మండలంలో కొన్నేళ్లుగా వరి, పత్తి, మొక్కజొన్న సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇదే స్థాయిలో పప్పు దినుసుల సాగు తగ్గుతూ వస్తోంది. మండలంలో 19 వేల ఎకరాల సాగు భూమి ఉంది. ఈ ఏడాది 10.700 ఎకరాల్లో వరి, 3.500 ఎకరాల్లో, పత్తి, 2500 ఎకరాల్లో మొక్కజొన్న, 1000 ఎకరాల్లో ఆయిల్‌పామ్, కూరగాయలు, ఇతర పంటలు, 500 ఎకరాల్లో బత్తాయి, మామిడి సాగు చేశారు. పదుల సంఖ్య విస్తీర్ణంలో పప్పు దినుసులను సాగు చేశారు. ఒకప్పుడు ఆహార ధాన్యాలకు పెద్దపీట వేస్తూ పచ్చ, తెల్లజొన్న, కొర్రలు, వేరుశెనగ, కంది, పెసర, మినుము, శనగ వంటివి సాగు చేసేవారు. మూడేళ్ల క్రితం వరకు అధిక విస్తీర్ణంలో పత్తి సాగు చేసేవారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి సాగునీరు పుష్కలంగా విడుదల చేస్తుండటంతో వరి సాగు విస్తీర్ణం మూడు వేల నుంచి పదివేలకు పెరిగింది. యాభై వేల నుంచి 2.30 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇదే క్రమంలో మండలంలో ఆహార ధాన్యాల సాగు పూర్తిగా తగ్గుతూ వస్తోంది. వేల ఎకరాల నుంచి వందల ఎకరాలకు పడిపోయింది.



రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం

ప్రస్తుతం వరికి బదులు పప్పుదినుసులు సాగు చేసుకుంటే రైతులకు మేలు అని సలహాలు, సూచనలు ఇస్తున్నాం. కానీ రైతులు వరి, మొక్కజొన్న సాగుకే మొగ్గుచూపుతున్నారు. యాసంగిలో పప్పు దినుసులతో పాటు నూనె గింజల సాగు లాభదాయకం, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. చిరుధాన్యాల సాగు రైతులకు శ్రేయస్కరం.

– కిరణ్మయి, ఏవో, గన్నేరువరం

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



చొప్పదండి: 3కె రన్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



హుజూరాబాద్: ప్రశంసాపత్రం అందిస్తున్న ఎంపీడీవో



జమ్మికుంటలో ఎంపీడీవో, ఎంఈవో

హుజూరాబాద్: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎంపీడీవో టి. సునీత అన్నారు. పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ పోటీలు గురువారంతో ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. వాలీబాల్‌లో బాలుర విభాగంలో హుజూరాబాద్ ప్రథమ, పెద్దపాపయ్యపల్లి ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో హుజూరాబాద్ ప్రథమ, రన్నర్‌గా టీడబ్ల్యూఆర్‌ఎస్ విజేతగా నిలిచాయి. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీవో సతీష్, టోర్నమెంట్ కమిటీ మెంబర్ టీ. శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరి సొల్లు సారయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.

జమ్మికుంట: క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీడీవో భీమేశ్ అన్నారు. పట్టణంలోని బాలుర పాఠశాల మైదానంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలు ముగిశాయి. చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, ప్రత్యేక శిక్షణతో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో హేమలత, హెచ్‌ఎం సదానందం, సీఎం కప్ పోటీల ఇన్‌చార్జి శ్రీలత, పీఈటీలు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగాధర: సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా మండలానికి చెందిన క్రీడాకారులకు అథ్లెటిక్స్ పోటీలను మోడల్ స్కూల్ ఆవరణలో నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎం.మురళీకృష్ణ హాజరై విజేతలకు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు బాబు శ్రీనివాస్, తోట హరికిషన్, ఇనుముల రవీందర్, కృష్ణవేణి, రజిత, దివ్య, రాకేశ్, నాగార్జున, ఎం.రాకేశ్, శివ, జాతీయ క్రీడాకారుడు లోకిని నరేశ్ పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక శిక్షణ విద్యాలయం ఆవరణలో సీఎం కప్ క్రీడల్లో భాగంగా 3కె రన్ నిర్వహించారు. క్రీడలను ప్రోత్సహించేందుకు విద్యాలయంలోని ట్రాక్‌పై రన్ నిర్వహించారు. కార్యక్రమంలో పీడీ ఇనాక్, పీఈటీ విక్రమ్, ఆర్మీ స్టాఫ్, కోచ్‌లు పాల్గొన్నారు.

సైదాపూర్: వెన్కెపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో మూడు రోజులగా నిర్వహించిన సీఎం కప్ క్రీడలు గురువారంతో ముగిశాయి. విజేతలకు తహసీల్దార్ మంజుల బహుమతులు ప్రదానం చేశారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను జిల్లాలో నిర్వహించే క్రీడలకు పంపించనున్నామని ఎంపీడీవో యాదగిరి, పీఈటీలు తెలిపారు.

అభ్యంతరాలు రాతపూర్వకంగా తెలపాలి

రామడుగు: మండలంలో 222 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, అభ్యంతరాలు రాతపూర్వకంగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో తెలియజేయాలని ఎంపీడీవో ఎస్.రాజేశ్వరి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ స్టేషన్ డ్రాఫ్ట్ పబ్లికేషన్‌పై అభ్యంతరాలు, ఇతర అంశములపై మండల స్థాయి రాజకీయ నాయకులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. చివరి పోలింగ్ జాబితా 17న గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రచురిస్తామని, ఇప్పటివరకు మండలంలో 40,486 ఓటర్లు ఉన్నారని తెలియజేశారు. మండల పంచాయతీ అధికారి శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకుడు రాజేశ్, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు జవ్వాజి హరీశ్, మాజీ ఉపాధ్యక్షుడు పూరెల్ల గోపాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొమ్మరవేణి తిరుపతి, సీపీఎం నాయకుడు కోలాపురి ప్రభాకర్, ఎలకపల్లి లచ్చయ్య, పంజాల శ్రీనివాస్ పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జమ్మికుంట: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భీమేశ్ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 188 పోలింగ్ కేంద్రాల వివరాలను తెలియజేశారు. ఎంపీవో వెంకటేశ్వర్లు, పర్యవేక్షకుడు శైలజ రాణి, ఆయా పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

- నేదునూర్‌లో ఆరోగ్య మహిళ



తిమ్మాపూర్: మండలంలోని నేదునూరులో గురువారం ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహించారు. వివిధ పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జువేరియా, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం వార్తలు

జీపీ కార్మికుడి మృతి

మానకొండూర్‌రూరల్: మండలంలోని ముంజంపల్లి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న కుక్క సంజీవ్ (25) గురువారం అనారోగ్యంతో మృతిచెందినట్లు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లి సునీత పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తోంది. మృతుడి కుటుంబాన్ని గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు పరామర్శించారు.

చికిత్స పొందుతూ..

హుజూరాబాద్ : మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన సముద్రాల కనకయ్య (67) రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి. ఇంటి పనుల నిమిత్తం షాపుకు వెళ్లి వస్తున్న క్రమంలో హుజూరాబాద్ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కాగా మాజీ సర్పంచ్ హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి వైద్యుల సూచనతో హన్మకొండకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు కిషోర్ కుమార్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

వన్నారంలో..

మానకొండూర్: మండలంలోని వన్నారం గ్రామానికి చెందిన బసుక రవి(46) కరీంనగర్ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. అన్నదమ్ముల మధ్య వ్యవసాయ భూమి విషయంలో కొద్ది నెలలుగా గొడవలు జరుగుతున్నాయి. డిసెంబర్ 9న రవి గడ్డి మందు సేవించడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ముగ్గురికి గాయాలు

హుజూరాబాద్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో గురువారం ఓ కారును ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. పొద్దుటూరి సంజీవరెడ్డి, సరోజన, శ్రీలత పట్టణంలో ఓ శుభకార్యానికి హాజరై కారులో కరీంనగర్ వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను 108లో హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గొర్రెలను ఎత్తుకెళ్లిన దొంగలు

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన అడితం రాజు రెండు గొర్రెలను బుధవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. మందలో నుంచి జీవాలను ఎత్తుకెళ్లారని రాజు వాపోయాడు. గొర్రెల విలువ రూ.ఇరవై వేలకుపైగా ఉంటుందని బాధితుడు తెలిపాడు.

కనుకయ్య కుటుంబానికి అండగా సీపీఐ

చిగురుమామిడి: మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ బీస కనకయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి సీపీఐ నాయకులు నివాళి అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడారు. కనకయ్య కుటుంబానికి సీపీఐ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, హుస్నాబాద్ మండల కార్యదర్శి గడిపె మల్లేశ్, జిల్లా నాయకులు ముద్రకోల రాజయ్య, తేరాల సత్యనారాయణ, గడ్డం రాంరెడ్డి, అల్లెపు జంపయ్య, రాజమౌళి, మోహన్, రవి పలువురు పాల్గొన్నారు.



మానకొండూరు: మండలం కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కాలనీ గుండా వెళ్లే డీబీఎం 3 ఉపకాల్వలో మురుగునీరు నిలిచి దుర్గంధం వెలువడుతోందని, దోమలు వృద్ధి చెంది రోగాలబారినపడుతున్నామని సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రేవంత్‌రెడ్డి, జీపీ కార్యదర్శి, సెల్ నం: 9885161773

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఘనంగా భాషా దివస్



వివిధ రాష్ట్రాల వస్త్రధారణలో విద్యార్థులు

హుజూరాబాద్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ప్రముఖ కవి, బహుభాషావేత్త సుబ్రహ్మణ్య భారతి పుట్టినరోజు పురస్కరించుకొని హెచ్‌ఎం తిరుమల ఆధ్వర్యంలో భారతీయ భాషా దివస్ నిర్వహించారు. ఎంఈవో భూపతి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. అన్ని భాషలకు మూలం సంస్కృతం అని, భాషలు నేర్చుకోవడం చాలా సులభమని, ప్రస్తుతం ఇంగ్లిష్ తప్పనిసరిగా నేర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజల వస్త్రధారణ ఆకట్టుకుంది.

ప్రారంభోత్సవానికి తరలిరండి



మాట్లాడుతున్న నాయకులు

రామడుగు: హైదరాబాద్ కోకాపేటలో 14న రాష్ట్ర కురుమ సంఘం దొడ్డి కొమురయ్య ఆత్మగౌరవ భవనం ప్రారంభోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి తరలి రావాలని మండల కురుమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎలకపల్లి లచ్చయ్య కోరారు. కురమ సంఘం రామడుగు అధ్యక్షుడు కడారి వీరయ్య అధ్యక్షతన గురువారం జరిగిన మండల కురుమ సంఘం కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి భవనాన్ని ప్రారంభించనుండగా, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తదితరులు హాజరవుతారని, రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం ఆధ్వర్యంలో కార్యక్రమం జరగనుందన్నారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి



ఎన్నికైన కళాశాల కమిటీ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

జమ్మికుంట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. గురువారం జమ్మికుంట మండల కమిటీ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలలో సభ్యత్వ నమోదు, కళాశాల కమిటీ ఎన్నిక నిర్వహించారు. పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలని, విద్యార్థులకు ఫ్రీ బస్‌పాస్‌లు అందజేయాలని డిమాండ్ చేశారు. నూతన కళాశాల అధ్యక్షుడు అంజి, కార్యదర్శి రాకేశ్, ఉపాధ్యక్షుడు అజయ్, రాంచరణ్, సహాయ కార్యదర్శి శౌర్యతేజ, వివేక్, సభ్యులు పవన్, వినయ్, కలీం, శ్రీహిత్ తదితరులను ఎన్నుకున్నారు.

నియామకం

హుజూరాబాద్: జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన పులుగు లతారెడ్డిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి ప్రణయ్ గురువారం ప్రకటనలో తెలిపారు.

- తరలిరావాలి

హుజూరాబాద్: పట్టణంలోని మధువని గార్డెన్‌లో 15న జరగనున్న మాదిగ ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశానికి మాదిగ ప్రజాప్రతినిధులు, నాయకులు భారీ సంఖ్యలో తరలిరావాలని శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

బూత్ కమిటీల ఎన్నిక

జమ్మికుంట: మండలంలోని వావిలాల గ్రామంలో గురువారం బీజేపీ ఎన్నికల అధికారి అలివేలి సమ్మిరెడ్డి, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక నిర్వహించారు. 143, 144 బూత్ కమిటీ అధ్యక్షులుగా మేడిపల్లి సమ్మయ్య, రాగళ్ల మహేశ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంపెల్లి సంపత్ రావు, విరగోని రాజన్న, కొండ హరీశ్, రుద్రవరం సదాశివచారి, మల్లన్న, సమ్మయ్య పాల్గొన్నారు.

నిధులు మంజూరు

సైదాపూర్: చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు మిడ్‌మానేర్ కుడికాలువ మరమ్మతు పనులకు రూ.15లక్షల నిధులు మంజూరైట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, ఏఎంసీ చైర్మన్ దొంత సుధాకర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో దొంత సుధాకర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గుండారం శ్రీనివాస్ విలేకర్లతో మాట్లాడారు. పూడికతో సాగునీరురాక యాసంగి పంటలు పండే పరిస్థితి లేదని రాష్ట్ర రవాణా, బీసీసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వివరించగా మంత్రి వెంటనే స్పందించి పూడిక తీతకు నిధులు మంజూరుచేయించారని, యాసంగిలో సాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్‌కు ఆదేశించారని పేర్కొన్నారు. మండలంలోని గుజ్జులపల్లి నుంచి శివాలయం వరకు రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి రూ. రెండు లక్షల నిధులు మంజూరు చేయించారని, మండలంలోని సమస్యలపై మంత్రి వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు.

కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలుచేయాలి



మాట్లాడుతున్న సంజయ్‌కుమార్, తదితరులు

హుజూరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల వాటా 42 శాతంకు పెంచి ఎన్నికలు నిర్వహించాలని బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ శాతం పెంచాలని, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలుచేయాలని, పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలన్నారు. హామీల అమలుకు హుజూరాబాద్‌లో 16న నిరాహార దీక్ష నిర్వహించనున్నామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు వెంకన్న, సాగర్, సదానందం గౌడ్, కట్ల రవి ముదిరాజు, కిషోర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

తిమ్మాపూర్: లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ డెల్ టెక్నాలజీస్ సహకారంతో ఎల్‌ఎండీ లోని డైట్ శిక్షణా సంస్థలో ఛాత్రోపాధ్యాయులకు 'మహిళా సాధికారత, కృత్రిమ మేధస్సు'అనే అంశంపై మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. లర్నింగ్ లింక్స్ ఫార్మేషన్ అసిస్టెంట్ మేనేజర్ సంజీవులు పవర్ బీ1, పైథాన్ ప్రోగ్రాం, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఏఐ, స్కిల్స్ మొదలైన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఇందులో 122 మంది ఛాత్రోపాధ్యాయులు పాల్గొని వివిధ విషయాలు నేర్చుకున్నారు. శిక్షణార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మొండయ్య పాల్గొన్నారు.